
సాక్షి
పల్నాడు

శనివారం। 13। మే। 2023



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి నీటి విడుదలను నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,100 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డుకు శనివారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చి యార్డు దిగుమతి, ఎగుమతి షాపుల కార్మిక సంఘం, దిగుమతి వ్యాపారుల సంఘం సూచనలు, అభ్యర్థనల మేరకు ప్రస్తుత వేసవి సీజనులో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. సెలవు రోజుల్లో మిర్చి యార్డులో దిగుమతులు, ఎగుమతులతో పాటు, ఎలాంటి క్రయ విక్రయాలు జరగవన్నారు. రైతులు సహకరించి యార్డుకు తమ మిర్చి బస్తాలను సెలవు రోజుల్లో తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. జూన్ 12వ తేదీ నుంచి యార్డులో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

94,975 బస్తాల మిర్చి విక్రయం

గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 81,402 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 94,975 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ. 9,000 నుంచి రూ. 23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ. 13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 30, 645 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి తెలిపారు.

ఆక్రమణ భూముల క్రమబద్ధీకరణ



జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: అక్టోబర్ 15, 2019 లేదా అంతకంటే ముందే ఆక్రమణలో ఉన్న అభ్యంతరం లేని అనధికారికంగా ఉన్న భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక జీఓను తీసుకొచ్చిందని శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. దీని ప్రకారం 100 చగ వరకు దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారికి డి పట్టా మంజూరు చేస్తారన్నారు. దీనికి 10 ఏళ్ళ తర్వాత తమకిష్టమైన వారికి బదలాయించే వీలుంటుందని తెలిపారు. 101 నుంచి 200 చగ బేసిక్ విలువలో 50 శాతం చెల్లించాలన్నారు. 201 నుంచి 300 చగ బేసిక్ విలువ పూర్తిగా చెల్లించాలని చెప్పారు. 301 నుంచి 500 చగ ఉన్న వారు బేసిక్ విలువలో 150 శాతం చెల్లించాలన్నారు. 100 నుంచి 500 చగ మధ్యలో ఉన్న స్థలాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగదు చెల్లిస్తే కన్వేయన్స్ డీడ్ ద్వారా సదరు వ్యక్తులకు పూర్తి హక్కులు కల్పిస్తారని చెప్పారు. దీనికి విద్యుత్ కనెక్షన్ బిల్లుగాని, ప్లాన్ గాని, నీటి పన్ను రసీదుగాని సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరని తెలిపారు.

తెనాలి నుంచి ఊటీకి ఆర్టీసీ టూరిస్ట్ బస్సు

తెనాలి: ఏపీఎస్ ఆర్టీసీ, తెనాలి డిపో నుంచి ఈనెల 20 తేదీన ఊటీకి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సు తెనాలి నుంచి బయలుదేరి ప్రయాణికులకు బెంగళూరు, మైసూర్ ప్యాలెస్, మైసూర్‌లోని ముఖ్యప్రదేశాలతోపాటు మరుసటిరోజు మొత్తం ఊటీలోనే ఉండి ప్రసిద్ధ ప్రదేశాలను తిలకించే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తిరిగి 23వ తేదీ ఉదయం తెనాలికి చేరుకుంటుందని వివరించారు. టికెట్ ఖరీదు రూ.3,380లుగా చెబుతూ ఆసక్తి గల ప్రయాణికుల వెంటనే బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

డెంగీ నివారణకు కృషి

బాపట్ల కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: డెంగీ జ్వరాలు నివారణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈనెల 16వ తేదీన జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ అధికారులు తయారు చేసిన యాక్షన్‌ప్లాన్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఫ్రైడే..డ్రైడేగా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ, మలేరియా అధికారి వై.రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి

నూతన జిల్లా కేంద్రాల్లో హెచ్ఆర్ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచిన ప్రభుత్వం

- 62 శాఖలకు చెందిన సుమారు 6 వేల మంది ఉద్యోగులకు ఆర్థిక లాభం
- జనాభా తక్కువ ఉన్న జిల్లాలలో హెచ్ఆర్ఏ పెంపు ఉంటుందని ఊహించలేదన్న ఉద్యోగులు
- ఉద్యోగుల మేలు కోరే ప్రభుత్వమిదని ప్రశంసిస్తున్న ఉద్యోగ సంఘాలు
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై హర్షం



సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగులు చాలా సంతోషంగా ఉన్నారు. నూతన జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు గతంలో ఉన్న హెచ్ఆర్ఏ 12 శాతం నుంచి 16 శాతానికి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెంచింది. కొత్త జిల్లా హెడ్ క్వార్టర్ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఇది పనిచేయనుంది. రాష్ట్రంలో నరసరావుపేటతో పాటు పార్వతీపురం, పాడేరు, అమలాపురం, బాపట్ల, రాజమండ్రి, భీమవరం, పుట్టపర్తి, రాయచోటి జిల్లా కేంద్రాలలో ఈ నిర్ణయం వర్తించనుంది. ఇటీవల ఉద్యోగులు, పెన్షనర్లకు ఏపీ ప్రభుత్వం డీఏ విడుదలలో శుభవార్త తెలిపిన విషయం తెలిసిందే. వరుస నిర్ణయాలతో మనసున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు ఉద్యోగులకు మేలుచేస్తాయని అభిప్రాయపడుతున్నారు.

ఆరు వేల మందికి లబ్ధి

నరసరావుపేట పట్టణం, దాని పరిసర ప్రాంతాల్లో 8 కిలో మీటర్ల పరిధిలో పనిచేసే సుమారు ఆరు వేల మందికి హెచ్ఆర్ఏ పెంపు వల్ల లబ్ధి చేకూరనున్నది. ఇందులో రెవెన్యూ, పోలీసులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వంటి 62 శాఖలకు చెందిన ఉద్యోగులు ఉంటారు. వీరిలో కనీసం రూ.1,200 నుంచి గరిష్ఠంగా రూ.8 వేల దాకా హెచ్ఆర్ఏ పెంపు వల్ల అదనపు లబ్ధి కలగనుంది. కొత్త జిల్లా కేంద్రాలలో జనాభా తక్కువగా ఉండటంతో హెచ్ఆర్ఏ పెంపు ఇప్పట్లో జరగదని ఉద్యోగులు భావించారు. కానీ ఉద్యోగుల బాధను అర్థం చేసుకున్న ప్రభుత్వం హెచ్ఆర్ఏ పెంచటం పట్ల పలు ఉద్యోగాల సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తశుద్ధికి నిదర్శనం



కొత్త జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగుల ఇంటి అలవెన్స్ 4 శాతం పెంచుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది అని చెప్పేందుకు ఇదే నిదర్శనం.

–స్వర్ణ చిన్న రామిరెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్.

ఉద్యోగుల క్షేమాన్ని కాంక్షించే నిర్ణయం



ప్రభుత్వానికి ఉద్యోగులు ఆయువుపట్టు లాంటివారు. వారి క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం ఆనందకరం. ఈ నిర్ణయంతో ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఉన్న అభిమానం కనిపిస్తోంది. కొత్త జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగి ఆర్థికంగా వెసులుబాటు లభించనుంది.

–దేవరాజుగట్టు ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, నరసరావుపేట

చాలా సంతోషంగా ఉంది



నూతన జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగులకు ఇంటి అలవెన్స్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇదే పంథాలో ఉద్యోగులకు మద్దతుగా మరిన్ని నిర్ణయాలు తీసుకోవాలి కోరుతున్నాం.

–షేక్. కరిముల్లా, ఉపాధ్యాయులు, ఎస్టీయు గౌరవాధ్యక్షులు, పల్నాడు జిల్లా.

'చుక్క'కు చరమగీతం



రైతులకు యాజమాన్య హక్కు పత్రాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాదు

- ఆ భూములకు శాశ్వత పరిష్కారం చూపిన ప్రభుత్వం
- జిల్లాలో 9,253 కుటుంబాలకు యాజమాన్య హక్కుపత్రాల పంపిణీ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చుక్కల భూముల 22–ఎ నిషేధిత జాబితా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి రైతులకు సంపూర్ణ హక్కు కల్పించిందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నుంచి రైతులకు హక్కులను కల్పిస్తూ పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి కలెక్టర్ వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10,885 సర్వే నంబర్ల ద్వారా నమోదైన 48,147 ఎకరాలకు యజమానులను గుర్తించినట్లు వెల్లడించారు. చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం ద్వారా 9,253 కుటుంబాలకు లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. అత్యధికంగా పల్నాడు జిల్లాలోని నరసరావుపేట రెవెన్యూ డివిజన్ నుంచి 18,799 ఎకరాల చుక్కల భూములకు యాజమాన్య హక్కు పత్రాలు వచ్చాయన్నారు. చుక్కల భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా భవిష్యత్‌లో రిజిస్ట్రేషన్, క్రయ, విక్రయాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వీటిపై ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి వెంటనే తీసుకు రావాలన్నారు. అనంతరం రైతులకు యాజమాన్య హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సమస్య గుర్తిస్తే పరిష్కరించండి

నరసరావుపేట: ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో కొనసాగుతున్న జగనన్న పేదలందరికీ ఇల్లు (హౌసింగ్), గ్రామోదయం, నగరోదయం, మిషన్ శోభాకృత్ కార్యక్రమాలపై శుక్రవారం సాయంత్రం ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో గురువారం రాత్రి పల్లె నిద్ర, బడి నిద్ర కార్యక్రమంలో ఎంత మంది ఏ.ఇలు పాల్గొన్నారు? ఎలా నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు పనులు ఎలా జరుగుతున్నాయో గమనించారా? అని ప్రశ్నించారు. రాత్రి బసలో ఏమైనా సమస్యలు గుర్తించారా అని అడిగారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి వేణుగోపాలరావు, జిల్లా అభివృద్ధి అధికారి డి. మహా లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఓబుల నాయుడు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారిణి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో..
ఆనందమానందమాయె

- దేశానికే సీఎం ఆదర్శం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పట్టా పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని

నివేశన స్థలాల పంపిణీ

చిలకలూరిపేట: జగనన్న పాలనలో పేదలంతా ఆనందంగా ఉన్నారని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గ్రామంలో 35 మంది పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఏకంగా 30 లక్షల మందికి పైగా మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి చరిత్ర సృష్టించిందని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తోందని వెల్లడించారు. అర్హులైతే చాలు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నా ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా జగనన్న ప్రభుత్వ పాలనను మార్చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆరంభిస్తున్న మంత్రి

హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం

చిలకలూరిపేట: పరిపాలనలో కనీవిని ఎరుగని స్థాయిలో సంస్కరణలు తీసుకొచ్చి జగనన్న ప్రజా పాలకుడిగా ఈ దేశానికే ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర మంత్రి విడదల రజిని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో రూ. 80 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలు, సుమారు రూ.44 లక్షలతో నిర్మించిన రెండు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి రజిని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊరూరా సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ఇలా ఒక నాయకుడు వందేళ్లకు ఒక్కడే వస్తారని కొనియాడారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయాల వల్ల ప్రజలకు సత్వరమే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వల్ల సత్వరమే వైద్య సేవలు ప్రజలు పొందగలుగుతున్నారని వెల్లడించారు.

డబ్బు కోసమే హత్యలు

- యాచకులను చంపిన సైకో అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్ రెడ్డి
- చెడు వ్యసనాలకు అలవాటై నేరాలకు పాల్పడుతున్నట్టు వెల్లడి
- నిఘా పెంచుతాం
- పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తాం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి నరసరావుపేట: యాచకులను లక్ష్యంగా చేసుకుని వరుస హత్యలకు పాల్పడుతున్న సైకో కిల్లర్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గడిచిన ఐదు రోజుల్లో పట్టణంలో వరుసగా మూడు హత్యలు చోటు చేసుకోవడంతో ప్రజానీకం ఉలికిపాటుకు గురైంది. కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు జంట హత్యలు జరిగిన గంట వ్యవధిలో కేసు ఛేదించారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన మార్కెట్ సెంటర్ సమీపంలోని సాంబశివ ఫర్నీచర్స్ వద్ద నిద్రిస్తున్న యాచక వృద్ధురాలిని బండరాయితో మోది హత్య చేశాడన్నారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన అనంతరం దుకాణం వద్ద లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అలాగే ఈ నెల 9వ తేదీన రైల్వే స్టేషన్ రోడ్డులోని కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంగా నిద్రిస్తున్న యాచకుడిని నిందితుడు హత్య చేశాడన్నారు. ఆ సంఘటనకు సమీపంలో విజయ దుర్గా కన్సల్టెన్సీ దుకాణం ముందు నిద్రిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా వాసి కరివేదుల సంపత్ రెడ్డిపై బండరాయితో మోది హత్య చేశాడన్నారు. జంట హత్యల కేసు నమోదు చేసి దుకాణాల వద్ద సీసీ ఫుటేజ్ పరిశీలించగా రెండు హత్యలను శివ సంజీవయ్య కాలనీకు చెందిన పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు ఉరఫ్ ముళ్లపంది చేసినట్లు వీడియోలో నిక్షిప్తమై ఉందన్నారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని మృతుల వద్ద అతను దోచుకున్న రూ.330 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతి చెందిన వారిలో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

చెడు వ్యసనాల బాట పట్టి...

అంకమ్మరావు చిన్న వయస్సు నుంచే చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగుతూ జల్సాలకు డబ్బుల కోసం దోపిడీలు, దొంగతనాలు చేస్తూ ఉంటాడని ఎస్పీ తెలిపారు. 2008 నుంచి అతనిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్‌లో 11 కేసులు నమోదు కాగా తాజాగా నమోదైన మూడు కేసులతో కలిపి 14 కేసులున్నాయి. 2022 జూన్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళను హత్య చేసి ఆమె వద్ద నుంచి రూ.2.50 లక్షలు దోచుకెళ్లాడు. ఆ కేసులో అరెస్ట్ అయి, కేసు కొట్టేసిన నేపథ్యంలో నెలరోజుల క్రితం బయటకు వచ్చాడు. దీంతో పాటు గతంలో అనేక కేసుల్లో జైలు శిక్ష అనుభవించి జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ వివరించారు.

ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు

పల్నాడు జిల్లాలో ప్రజలు భయపడవలసిన అవసరం లేదని ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇటువంటి సైకో కిల్లర్లపైన నిఘా పెట్టడం జరిగిందన్నారు. రోడ్ల పైన షాపుల ముందు నిద్రపోయే వారిని గుర్తించి, వారందరికీ గుంటూరు రోడ్డులో ప్రభుత్వం వారు కేటాయించిన విశ్రాంతి భవనానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నర్సరావుపేట పట్టణంలోని పలు ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, దుకాణాదారులు సైతం తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పట్టణాలల్లో కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచుతామన్నారు. రాత్రి గస్తీ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామన్నారు. వరుస హత్యల నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన నరసరావుపేట వన్ టౌన్ సీఐ అశోక్ కుమార్, టూటౌన్ సీఐ వీరేంద్రబాబు, బృందాన్ని ఎస్పీ అభినందించారు.

చిలకలూరిపేటలో 'దేశం' సిగపట్లు

ముదిరిన వివాదం

- ప్రత్తిపాటికి చెక్ పెట్టేందుకు రంగంలోకి భాష్యం ప్రవీణ్
- రెండు నెలలుగా వివాదం
- లోకేష్‌ని కలిసినా ప్రత్తిపాటికి దక్కని హామీ
- 15 వరకు డెడ్ లైన్
- ఈలోగా తేల్చుకుంటానన్న ప్రత్తిపాటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తనకు నచ్చకపోయినా.. గెలవడన్న అనుమానం వచ్చినా.. అప్పటి వరకూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ఎంతటి వారినైనా చంద్రబాబు నాయుడు వదిలించుకుంటాడన్న విషయం అందరికీ ఎరుకే. తాజాగా పదేళ్ల పాటు గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా, ఐదేళ్ల మంత్రిగా, ప్రస్తుతం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పార్టీ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ప్రత్తిపాటిని వదిలించుకునేందుకు పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ మరో వ్యక్తిని తెరపైకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తుండటంతో చిలకలూరిపేట తెలుగుదేశంపార్టీ రాజకీయం రసకందాయంలో పడింది. దీనికి గత ఏడాది ప్రకాశం జిల్లాలో జరిగిన మహానాడు నాంది పలికింది.

గుంటూరు జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బాష్యం ప్రవీణ్‌ను చిలకలూరిపేటలో రంగంలోకి దింపేందుకు తెరవెనుక ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇటీవల భాష్యం ప్రవీణ్ గుంటూరు పట్టణంతో పాటు యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలోనూ చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశాడు. టీడీపీ మహానాడు ప్రకాశం జిల్లాలో జరిగినప్పుడు యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామం హైవే పక్కనే మహానాడుకు వెళ్లే పార్టీ శ్రేణులకు ఉచిత అన్నదాన శిబిరాన్ని మూడు రోజులు ఏర్పాటు చేశారు. దీనిని చంద్రబాబు ప్రారంభించి అక్కడే ప్రచార రథంపై ఉండి ప్రసంగించారు. ఆ తర్వాత లోకేష్ యువగళం పాదయాత్రకు వెళ్లి సంఘీభావం తెలిపారు. పాదయాత్ర విజయవంతం కావాలంటూ కొన్ని పాటల్నీ రిలీజ్ చేశారు. చిలకలూరిపేటలో రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా, అలాగే రోజా ఉన్న దీక్షాధారులకు ఇఫ్తార్ విందును వేర్వేరుగా ఇవ్వనున్నట్లు అలాగే పట్టణంలోని అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తానంటూ మీడియాకు వెల్లడించారు. దీంతో కంగారుపడిన ప్రత్తిపాటి తనకు సన్నిహితంగా ఉండే అచ్చెన్నాయుడి ద్వారా ప్రవీణ్‌కు ఫోన్ చేయించి ఈ కార్యక్రమం జరగకుండా చూశారు. తర్వాత చంద్రబాబు నాయుడిని కలిసి తన గోడు వినిపించగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పొందగానే హైదరాబాద్‌కు ప్రత్తిపాటి ఫ్యామిలీతో సహా మకాం మార్చిన విషయాన్ని, కోవిడ్ వేళలోనూ పార్టీ వర్గీయులను పట్టించుకోలేదని, మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులను పట్టించుకోని విషయాన్ని, గత ప్రభుత్వ హయాంలో ప్రత్తిపాటి పుల్లారావు తన భార్య చేసిన వసూళ్లను అడ్డుకోలేదన్న విషయాలను చంద్రబాబు ప్రస్తావించినట్లు తెలిసింది. అయినా ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కదా చూద్దాం అని చెప్పి పంపినట్లు తెలిసింది. ఇటీవల చంద్రబాబు నాయుడు చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాలలో మిర్చి రైతులను పరామర్శించేందుకు చేపట్టిన యాత్రకు చిలకలూరిపేటలో స్పందన లేకపోవడం కూడా ప్రత్తిపాటిపై ఆగ్రహానికి కారణంగా చెబుతున్నారు.

మరోవైపు చిలకలూరిపేట నియోజకవర్గం టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న భాష్యం ప్రవీణ్ చంద్రబాబు 73వ పుట్టినరోజు నాడు వెళ్లి రూ.73 లక్షలు పార్టీకి విరాళంగా అందజేసి మార్కులు కొట్టేశాడు. ఇప్పటికే తనకు సహకరిస్తున్న కొంతమంది ప్రత్తిపాటిని వ్యతిరేకిస్తున్న నాయకుల ద్వారా పేటలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇది తెలిసి ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం యువగళం కార్యక్రమంలో లోకేష్‌ను ప్రత్తిపాటి కలిసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. అయితే లోకేష్ నుంచి ఎటువంటి హామీ రాలేదని సమాచారం. దీంతో ఈ నెల 15 నాటికి సీటు నాదే అని ప్రకటించకపోతే మీరు కార్యక్రమాలు చేసుకోవచ్చని, దానికి తాను కూడా సహకరిస్తానని చెప్పినట్లు బాష్యం ప్రవీణ్ వర్గం నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీ ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికీ తమ మద్దతు ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఆహ్లాదకరంగా రక్షణ నిలయాలు

- మారుతున్న పోలీస్‌స్టేషన్ల రూపురేఖలు
- ఎస్పీ ఆదేశాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్న సిబ్బంది
- సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు



నూతన హంగులతో దర్శనమిస్తున్న నరసరావుపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్



టూటౌన్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు

నరసరావుపేటటౌన్: ఎన్నో గొడవలు.. మరెన్నో వివాదాలు.. ఇంకెన్నో సమస్యలతో పోలీసు స్టేషన్ ప్రాంగణంలో అడుగుపెట్టిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణం అక్కున చేర్చుకుంటుంది. మర్యాదపూర్వకమైన మాటలతో వారి బాధలను అక్కడ అధికారులు తగ్గిస్తుంటే.. మరోవైపు చూడముచ్చటగొలిపే పచ్చదనం వారి సమస్యలకు పరిష్కారం దొరికినట్టేలా గోచరిస్తుంది. ఇదీ పల్నాడు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న వాతావరణం.

శ్రీకారం చుట్టిన ఎస్పీ

పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డుల్లో సమస్యలకంటే.. స్టేషన్ పరిసరాలు ఎస్పీని ఇబ్బంది పెట్టాయి. స్టేషన్‌లోకి అడుగు పెట్టగానే.. గుమ్మంలోనే చెత్త స్వాగతం పలికింది. ఎస్పీ పోలీసు అధికారులపై మండిపడ్డారు. స్టేషన్లో రికార్డులకంటే తొలుత పరిసరాలు దుమ్ము వదిలించాలని ఆదేశించారు. ఈ స్టేషన్ చూశాక ఎస్పీ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల రూపురేఖలు మార్చేయాలని కంకణం కట్టుకున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 33 పోలీస్‌స్టేషన్లను సుందరంగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనికిగాను స్టేషన్లో ఉన్న సిబ్బంది కూడా తమ వంతు సహకారం అందించారు. పోలీసుస్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. నరసరావుపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ భవనానికి నూతన రంగులు ఏర్పాటు చేశారు. స్టేషన్ పరసరాలను శుభ్రపరిచి ప్రాంగణమంతా పచ్చదనంతో నింపారు. ఇదే తరహాలో మరమ్మతులకు గురైన భవనాలు చక్కబడుతున్నాయి. అవి పెయింటింగ్‌లు అద్దుకుని సుందరంగా మెరిసిపోతున్నాయి. మరో వైపు పరిసరాల్లో అపరిశుభ్రతకు దూరమై.. ఆ స్థానంలో మొక్కలు వచ్చి చేరుతున్నాయి. దీంతో స్టేషన్ వచ్చే ప్రజలను పచ్చదనం ఆహ్వానిస్తోంది. ఇలా జిల్లా ప్రధాన కేంద్రమైన నరసరావుపేటతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లు ఆహ్లాద వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి.

పోలీస్‌స్టేషన్లే దేవాలయాలు



ప్రతి ఉద్యోగికీ వారు పనిచేసే కార్యాలయం దేవాలయంతో సమానం. అందుకే ఆ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఉద్యోగులు ఇంట్లో కంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం వెచ్చిస్తుంటారు. అలాంటి వారు కార్యాలయాలను దేవాలయాలుగా చూసుకోవాలి. ఈ క్రమంలో తమ సిబ్బంది ఎంతో హుందాగా ముందుకు వచ్చి తమ కార్యాలయాల రూపురేఖలు మారుస్తున్నారు.

– వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

రహదారులను ఆగం చేస్తే జరిమానా



గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఇర్లపాడు గ్రామంలో నవోదయ కార్యక్రమం

నాదెండ్ల: రోడ్లపై చెత్త వేసి అపరిశుభ్రపరిస్తే పంచాయతీ అధికారులకు అపరాధ రుసుం వేసే అధికారం ఉందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామాన్ని శుక్రవారం ఆయన నవోదయం కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఉదయం 7గంటలకు గ్రామానికి వచ్చిన ఆయన 11 గంటల వరకు గ్రామంలోనే గడిపారు. ముందుగా గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. సైడు కాల్వల నిర్వహణ ఎలా ఉండాలో అధికారులకు సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార విషయాలను తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న విషయాన్ని సర్పంచ్ మంగు రమాదేవి వివరించారు. గ్రామంలో తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ, వ్యవసాయ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామీణ ఉపాధి పనుల్లో పాల్గొన్న కలెక్టర్

250 మంది కూలీలతో గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించారు. పంట కాల్వల పూడికతీత పనులను పరిశీలించి కూలీలకు అందతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా ఆయనే పలుగు తీసుకొని కొద్దిసేపు పనుల్లో నిమగ్నమయ్యారు. ఆయనతోపాటు సర్పంచ్ రమాదేవి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, పీఎంసీ చైర్మన్లు ఒంగూరి కృష్ణమనాయుడు, యడ్ల మరియదాసు, స్థానిక అధికారులు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, ఏపీఎం భరత్, ఏపీవో పుష్పరాజ్, సీడీపీవో శాంతకుమారి, ఏవో ఎ హరిప్రసాద్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

మనసును కదిలించిన నాటికలు



''లక్ష్మణరేఖ దాటితే...'' నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: స్థానిక మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్, నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ''లక్ష్మణ రేఖ దాటితే...'' నాటికను ప్రదర్శించారు. పండు క్రియేషన్స్, కొప్పోలు వారి ఆధ్వర్యంలో ''పక్కింటి మొగుడు'' అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణం, మండలంలోని విత్తన దుకాణాల్లో పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో విత్తనాల స్టాక్‌ను రిజిస్టర్లో ఎంట్రీ చేయని కారణంగా రూ.2.30లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను నిలిపివేయడం జరిగిందని, రైతులకు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లు రైతులు ఫిర్యాదు చేసినట్లయితే దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తరువాత రసీదు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ ఏడీఏలు సీహెచ్.రవికుమార్, సుజాత, ఏవోలు అరుణకుమారి, వెంకట్రావు, వినుకొండ ఏవో కె.అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ



బంగారు తమలపాకులను ఆలయ ఏసీ సుభద్రకు అందజేస్తున్న దాతలు



అరటి పండ్ల పూజలో ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి హనుమజ్జయతి సందర్భంగా శుక్రవారం అరటిపండ్ల పూజ నిర్వహించారు. ఉదయం స్వామివారిని అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారి 11 ఆవృత్తాలుగా అరటి పండ్ల పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బంగారు తమలపాకుల దండ బహూకరణ..

మండలంలోని మైలవరం గ్రామానికి చెందిన నరిశెట్టి చంద్రశేఖర్, విద్యాపవన్, మన్నేపల్లి విద్యాదిత్య నాగపుష్ప, మన్నేపల్లి ప్రసాద్ పుష్పాంజలి, మన్నేపల్లి ప్రవీణ్ మేఘన, యాగంటి అశోక్ గాయత్రి, మన్నేపల్లి కార్తీక్ లావణ్య దంపతులు రూ.24 లక్షలు విలువ చేసే బంగారు తమలపాకులను కార్యనిర్వహణాధికారి సుభద్రకు అందజేశారు.

జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. అధికారులు 1902కు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి 24 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు అందితే దానికి గల కారణాలు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ఎండార్స్‌మెంట్‌లో రాసి ఫిర్యాదుదారునికి పంపించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల నుంచి కలెక్టరేట్ వరకు అధికారులు, సిబ్బంది జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావించాలని కలెక్టర్ వివరించారు.

ఆటో బోల్తా కొట్టి ఏడుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సత్తెనపల్లి: ఆటో బోల్తా కొట్టి ఏడుగురికి గాయాలైన సంఘటన అబ్బూరు రోడ్‌లో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి నుంచి కూలీలతో వెళుతున్న ఆటో అబ్బూరు రోడ్‌లో జగనన్న కాలనీ దాటిన తర్వాత గేదెను తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న వెంకటమ్మ, కె.సత్యవతి, కె.భాగ్యంలకు తీవ్ర గాయాలు కాగా ఆర్‌వీ లక్ష్మమ్మ, కె.సునందదేవి, నవ్య, మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



గరుడ వాహనంపై అమ్మవార్లతో శ్రీవారు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజైన శుక్రవారం శ్రీస్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటల నుంచి మేళతాళాలు, ప్రత్యేక పూల అలంకరణలతో విద్యుత్‌కాంతుల నడుమ శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు పర్యవేక్షించారు. అంతకుముందు గురువారం రాత్రి స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా ఎదురుకోలు ఉత్సవం, అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. వేదకలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్–పుష్ప దంపతులు శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించి, కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి రూ.లక్ష విరాళం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి శుక్రవారం లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలను తెనాలికి చెందిన ప్రసాద్ ల్యాబ్స్ అధినేత జీవీఎస్ఆర్‌కే ప్రసాద్ విరాళంగా అందించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటరెడ్డి, ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తూర్పుమాలపల్లెకు చెందిన కట్టా మస్తాన్(49) పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన మస్తాన్ ఈ నెల 8వ తేదీ భార్యను మద్యానికి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించటంతో మనస్థాపానికి గురై ఇంట్లో గడ్డి మందు సేవించాడు. బంధువులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

రహదారిపై సర్వీస్ రోడ్ గ్రిల్స్‌ను ఢీకొన్న వాహనం



వాహనం లోపలికి దూసుకువచ్చిన గ్రిల్స్

అద్దంకి రూరల్: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనం రోడ్డు మధ్యన ఉన్న గ్రిల్స్‌ను ఢీకొట్టటంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన పూనూరి మెస్సేక్ అదే గ్రామంలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు ఇవ్వటంతో అద్దంకి పట్టణంలోని ఈవెంట్స్‌కు ఆర్కెస్ట్రా నిర్వహిస్తున్న వ్యక్తి వద్దకు పనికి వస్తున్నాడు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం రాత్రి జరుగుతున్న క్రైస్తవ సభలకు ఆర్కెస్ట్రా కార్యక్రమం పూర్తి చేసుకుని అర్ధరాత్రి అద్దంకి వస్తున్నాడు. ఆర్కెస్ట్రా నిర్వాహకుడు వాహనం నడుపుతున్నాడు. పక్కన పునూరి మెస్సేక్ (16) కూర్చుని నిద్రపోతున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ వద్దకు రాగానే రహదారి మధ్యన ఉన్న గ్రిల్స్‌ను వాహనం ఢీకొట్టింది. గ్రిల్స్‌కు ఉన్న ఇనుపరాడ్ నిద్రపోతున్న మెస్సేక్ గొంతులోకి దిగింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సమందర్‌వలి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి వెంగయ్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.